సాక్షి రాజన్న సిరిసిల్ల

శుక్రవారం | 25 | జూలై | 2025



ఘనంగా వన మహోత్సవం

వేములవాడఅర్బన్: అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం వనమహోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ శంకర్, వైస్‌ప్రిన్సిపాల్ లావణ్య, శారద, శోభారాణి, నర్సయ్య ఉన్నారు.



రాజన్నకు అమావాస్య ఎఫెక్టు

వేములవాడ: రాజన్నకు గురువారం అమావాస్య ఎఫెక్టు కనిపించింది. నిత్యం రద్దీగా కనిపించే ఆలయ ఆవరణ, క్యూలైన్లు భక్తులు లేక వెలవెలబోయింది.

గరిష్టం/కనిష్టం

27.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

- సీనియర్ సివిల్ జడ్జి రాధికా జైస్వాల్



మాట్లాడుతున్న జడ్జి రాధికా జైస్వాల్

సిరిసిల్లకల్చరల్: యువత వ్యసనాలకు దూరంగా ఉంటూ.. బంగారు భవిష్యత్ కోసం విశ్రమించకుండా శ్రమించాలని సీనియర్ సివిల్ జడ్జి రాధికా జైస్వాల్ సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం సంజీవయ్యనగర్‌లోని సహస్ర జూనియర్ కళాశాలలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు టీజింగ్, ర్యాగింగ్ వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. న్యాయవాదులు ఆడెపు వేణు, గెంట్యాల భూమేశ్, లోక్ అదాలత్ సభ్యుడు చింతోజు భాస్కర్, కళాశాల నిర్వాహకుడు సిద్ధిరాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సోషల్ మీడియాపై నిఘా

- ఎస్పీ మహేశ్ బి గీతే



ఎస్పీ మహేశ్ బి గీతే

సిరిసిల్లక్రైం: అనుచిత వ్యాఖ్యలు చేస్తూ శాంతి భద్రతలకు భంగం వాటిల్లేలా సోషల్‌మీడియాలో ప్రచారం చేసే మెసేజ్‌లపై నిఘా ఉంటుందని ఎస్పీ మహేశ్ బి గీతే పేర్కొన్నారు. వాస్తవాలు గ్రహించకుండా అసత్య ప్రచారాలు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల్లో ఒక వర్గాన్ని, పార్టీని, మత విద్వేషాలను రెచ్చగొట్టే వారిపై సోషల్ మీడియా ట్రాకింగ్ విభాగం నిరంతరం నిఘా కొనసాగిస్తుందని పేర్కొన్నారు. అవాస్తవాలను ప్రచారం చేసే వారి వివరాలను 87125 37826 నంబర్‌కు మెసేజ్ చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

శ్రావణంలో ప్రత్యేక ఏర్పాట్లు

- ఈవో రాధాభాయి



రాధాభాయి, ఈవో

వేములవాడ: శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 25 నుంచి ఆగస్టు 22 వరకు శ్రావణమాసం సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఈవో రాధాభాయి గురువారం తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యే ఈనెల రోజులపాటు ప్రత్యేక సిబ్బంది, ప్రత్యేక క్యూలైన్లు, పూజారులకు విధులు కేటాయించినట్లు చెప్పారు. భక్తుల రద్దీకి అనుగుణంగా శానిటేషన్ పనులు, తాగునీరు, విద్యుత్ సరఫరా, కౌంటర్లు, ప్రసాదాలు అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు.

ముసురుకున్న వర్షం



సిరిసిల్లటౌన్: జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో గురువారం 'ముసురు'కుంది. వర్షపాత వివరాలు మిల్లీమీటర్లలో..చందుర్తి 50.6, రుద్రంగి 44.1, వేములవాడ రూరల్ 34.7, బోయినపల్లి 34.2, ముస్తాబాద్ 34.2, గంభీరావుపేట 32.9, ఇల్లంతకుంట 27.2, వేములవాడ 27, వీర్నపల్లి 22.8, తంగళ్లపల్లి 22.6, కోనరావుపేట 22.5, ఎల్లారెడ్డిపేట 20.8, సిరిసిల్ల 17.7 నమోదైంది.

అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి దరఖాస్తు గడువు పెంపు

సిరిసిల్లకల్చరల్: అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకానికి దరఖాస్తు చేసుకునే గడువు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయించినట్లు జిల్లా ఇన్‌చార్జి ఎస్సీడీవో రాజమనోహర్‌రావు ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో అమెరికా, కెనడా, సౌత్‌కొరియా, జర్మనీల్లో ఉన్నత చదువులు చదవాలనుకునే ఎస్సీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈనెల 19 నుంచి ఆగస్టు 31 వరకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

దివ్యాంగులకు పునరావాసం

సిరిసిల్లకల్చరల్: దివ్యాంగులకు పునరావాస పథకం కింద దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం తెలిపారు. జిల్లాకు 17 యూనిట్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. రూ.50వేల చొప్పున 14 యూనిట్లు, రూ.లక్ష యూనిట్ 80శాతం రాయితీ, రూ.2లక్షల యూనిట్ 70శాతం, రూ.3లక్షల యూనిట్ 60శాతం రాయితీతో ఒక్కొక్కటి మంజూరైందని వివరించారు. అర్హులైన దివ్యాంగులు tgobmms.cgg.gov.in లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో ఈనెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆదర్శం అచ్చన్నపల్లి

- ప్రైవేట్ స్కూళ్ల బస్సులు రాని ఊరు
- ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాల
- పదేళ్లుగా ఏకతాటిపైన గ్రామస్తులు
- నాణ్యమైన భోజనం, విద్యాబోధన

వేములవాడరూరల్: ఉదయం జావ.. మధ్యాహ్నం నాణ్యమైన భోజనం.. సాయంత్రం స్నాక్స్.. స్వచ్ఛమైన తాగునీరు.. నాణ్యమైన విద్యాబోధన.. ఇదంతా ప్రభుత్వ బడిలోనే. అవును గ్రామస్తులు ఏకమై తమ పిల్లలు ఊరు దాటి వెళ్లవద్దనే ఉద్దేశంతో స్వచ్ఛందంగా డబ్బులు జమచేస్తూ ప్రైవేట్ టీచర్లను పెట్టి మరీ ప్రభుత్వ బడిని బతికించుకుంటున్నారు. వారే వేములవాడరూరల్ మండలం అచ్చన్నపల్లి గ్రామస్తులు.

57 మంది విద్యార్థులు

వేములవాడ రూరల్ మండలం అచ్చన్నపల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 57 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ పాఠశాలలో ఇద్దరు మాత్రమే ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉండగా.. గ్రామస్తులు ముందుకొచ్చి మరో నలుగురు ప్రైవేట్ టీచర్లను నియమించుకున్నారు. ఇందుకు పదేళ్ల క్రితం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ వేసుకున్నారు. ఆ కమిటీ ఆధ్వర్యంలో పాఠశాలను నిర్వహిస్తున్నారు.

అందరూ రైతులే..

అచ్చన్నపల్లిలో గ్రామంలో 175 గృహాలు, 744 మంది జనాభా ఉన్నారు. ఈ గ్రామంలో అందరూ వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తారు. ఉదయం పొలం పనులకు వెళ్తే సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రారు. ఈక్రమంలో స్కూల్‌కు వెళ్లిన పిల్లలకు నాణ్యమైన ఇంటి భోజనం అందించాలనే ఉద్దేశంతో కమిటీ ఆధ్వర్యంలో ఏడాదికి ఒక్కో విద్యార్థికి రూ.8వేలు చొప్పున జమచేసుకుంటున్నారు. ప్రత్యేకంగా వంట మనుషులను ఏర్పాటు చేసి ఉదయం జావ, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్ అందజేస్తున్నారు. ఇలా ప్రతీ నెల రూ.40వేల వరకు వెచ్చిస్తున్నారు. ఈ ఖర్చంతా పిల్లల తల్లిదండ్రులే భరిస్తున్నారు. ఎల్‌కేజీ, యూకేజీ పిల్లలకు సైతం విద్యాబోధన చేస్తున్నారు. పిల్లలకు స్వచ్ఛమైన వాటర్ అందించాలని స్కూల్ పక్కనే మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. పిల్లలతోపాటు గ్రామస్తులు కూడా ఇక్కడి నుంచే ఉచితంగా శుద్ధనీటిని తీసుకెళ్తున్నారు.



పాఠశాలలో ప్రార్థన చేస్తున్న విద్యార్థులు



అచ్చన్నపల్లి ప్రాథమిక పాఠశాల

ఏటా నవోదయకు ఎంపిక

ఈ పాఠశాలలో చదివే పిల్లలు ఏటా 5వ తరగతి పూర్తికాగానే నవోదయ పాఠశాలకు ఎంపికవుతున్నార. గత కొన్నేళ్లుగా ప్రతీ సంవత్సరం నలుగురు నుంచి ఐదుగురు విద్యార్థులు ఎంపికవుతున్నారు. అన్ని ఏర్పాటు చేసుకున్నప్పటికీ ప్రభుత్వం అదనపు గదులు, టీచర్లను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గ్రామస్తుల సహకారంతో...



ఈ పాఠశాలలో చదివే ప్రతీ విద్యార్థిపై గ్రామస్తులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. మా స్కూల్‌కు ఎలాంటి లోటు రాకుండా ఎంతో సహకరిస్తున్నారు. ఈ గ్రామం నుంచి ప్రైవేటు బడులకు ఎవరూ పోరు.

– శ్రీనివాస్, హెచ్ఎం, అచ్చన్నపల్లి

పదేళ్లుగా ప్రైవేటుకు బంద్



మా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోకే మా పిల్లలను పంపిస్తాము. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఇక్కడ చదువుకుంటారు. భోజనంతోపాటు అన్ని సౌకర్యాలను గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేస్తాం. గత పదేళ్లుగా మా గ్రామానికి ప్రైవేటు పాఠశాల వాహనాలు రావు.

– దాసె కొమురయ్య, మాజీ సర్పంచ్, అచ్చన్నపల్లి

ఈ తిప్పలు తప్పేదెప్పుడో?

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్



ఈ చిత్రం కోనరావుపేట మండలం మామిడిపల్లి–నిజామాబాద్ మధ్య మూలవాగు. ఇక్కడ కొన్నేళ్ల క్రితం నిర్మించిన కాజ్‌వే ఏటా వర్షాలకు కొట్టుకుపోతోంది. వర్షాలకు కొట్టుకుపోయిన చోట తాత్కాలిక మరమ్మతు మట్టిని నింపుతూ రవాణాను పునరుద్ధరిస్తున్నారు. ఇక్కడ వంతెన నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో రూ.14కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది. కానీ పనులు మొదలుకాకముందే ఈ నిధులు వాపస్ పోయాయి.



కొట్టుకుపోయిన ఈ మట్టి రోడ్డు కోనరావుపేట మండలం బావుసాయిపేట–వెంకట్రావుపేట మధ్య మూలవాగుపై ఏర్పాటు చేసిన తాత్కాలిక రోడ్డు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి రోడ్లు భవనాల శాఖ మంత్రి జీవన్‌రెడ్డి మంజూరు చేసిన నిధులతో కాజ్‌వే నిర్మించారు. ఐదేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు కాజ్‌వే కొట్టుకుపోగా తాత్కాలికంగా మట్టి పోశారు. ఇక్కడ వంతెన నిర్మాణానికి రూ.12కోట్లు మంజూరయ్యాయి. కానీ ప్రభుత్వం మారడంతో ఆ నిధులు రద్దయ్యాయి.

- ఏటా వర్షాలకు కొట్టుకుపోతున్న కాజ్‌వేలు
- గత ప్రభుత్వంలో రూ.52కోట్లు మంజూరు
- పనులు మొదలుకాకముందే రద్దయిన నిధులు
- గ్రామీణులకు తప్పని రవాణా ఇబ్బందులు

కోనరావుపేట(వేములవాడ): ఏళ్లుగా మూలవాగుపై రవాణా కష్టాలు తీరడం లేదు. చిన్నపాటి వర్షాలకే కాజ్‌వేలు కొట్టుకుపోతుండడం.. తాత్కాలిక మట్టిరోడ్లు ధ్వంసమవుతుండడంతో రవాణా కష్టాలు మొదటికొస్తున్నాయి. కాజ్‌వేల స్థానంలో వంతెనల నిర్మాణానికి నిధులు మంజూరైనా పనులు మొదలుకాకముందే రద్దు కావడంతో ఈ ప్రాంత ప్రజలు కష్టాలు తీరేదెప్పుడో తెలియడం లేదు.

మూడు చోట్ల ముప్పుతిప్పలు

కోనరావుపేట మండలం మామిడిపల్లి–నిజామాబాద్, వెంకట్రావుపేట–బావుసాయిపేట, వట్టిమల్ల–నిమ్మపల్లి గ్రామాల మధ్య గల మూడు ప్రాంతాల్లో మూలవాగుపై రవాణా కష్టాలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. వర్షాలు పడితే మూలవాగు ప్రవాహానికి రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి రవాణాశాఖ మంత్రి జీవన్‌రెడ్డి మంజూరు చేసిన నిధులతో ఈ ప్రాంతంలో మూడు వంతెనలు నిర్మించారు. ఐదేళ్ల క్రితం మూలవాగుకు వచ్చిన భారీ వరదలతో ఆ వంతెనలు కొట్టుకుపోవడంతో మళ్లీ కష్టాలు మొదలయ్యాయి.


రద్దయిన రూ.52 కోట్లు

మూలవాగుపై రవాణా కష్టాలు పరిష్కరించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం వంతెనల నిర్మాణాల కోసం రూ.52కోట్లు మంజూరు చేసింది. అనంతర కాలంలో ఎన్నికలు రావడం.. రాష్ట్రంలో ప్రభుత్వం మారిపోవడంతో ఆ నిధులు రద్దయ్యాయి. దీంతో ఈ ప్రాంత ప్రజల రవాణా కష్టాలు మళ్లీ మొదటికొచ్చాయి.



కూలీలు నడుచుకుంటూ వెళ్తున్న కొట్టుకుపోయిన కాజ్‌వే వట్టిమల్ల–నిమ్మపల్లి మధ్య మూలవాగుపై ఉంది. ఈ కాజ్‌వే కూడా భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. వట్టిమల్లతోపాటు మూడు గ్రామాలకు కోనరావుపేట వెళ్లడానికి ఇదే ప్రధాన రహదారి. కాజ్‌వే కొట్టుకుపోయినా, వాగు ప్రవహించినా రవాణా వ్యవస్థ స్తంభించిపోతుంది. ఈ మూలవాగుపై వంతెన నిర్మాణానికి రూ.14కోట్లు మంజూరుకాగా టెండర్ల స్థాయిలో నిధులు రద్దయ్యాయి.


నిధులు రద్దు చేశారు



కోనరావుపేట మండలంలోని మూలవాగుపై వంతెనల నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరయ్యాయి. జిల్లా స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధుల అవగాహన రాహిత్యంతో ఆ నిధులను రద్దు చేశారు. దీంతో మూలవాగుపై వర్షాకాలంలో ప్రయాణానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా వంతెనల కోసం నిధులు మంజూరు చేయాలి.

– మంతెన సంతోష్, వెంకట్రావుపేట మాజీ సర్పంచ్

శాశ్వతంగా పరిష్కరించాలి



వట్టిమల్ల నుంచి నిమ్మపల్లికి, కోనరావుపేట మండల కేంద్రానికి మూలవాగు పై నుంచే వెళ్లాలి. వాగుపై గతంలో నిర్మించిన వంతెన కొట్టుకుపోయింది. తాత్కాలికంగా మరమ్మతులు చేస్తున్నా వర్షాలకు కొట్టుకుపోతోంది. అధికారులు స్పందించి రవాణా కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపాలి.

– గుండా శ్రీకాంత్, వట్టిమల్ల

ప్రతిపాదనలు పంపాం

కోనరావుపేట మండలంలోని మామిడిపల్లి, బావుసాయిపేట, వట్టిమల్ల, కొండాపూర్ పెంటివాగుపై వంతెనలకు ఎస్‌డీఎఫ్ నుంచి నిధులు మంజూరయ్యాయి. మూలవాగుపై వంతెనల కోసం టెండర్లు పిలువగా చివరి రోజు నిధులు రద్దయ్యాయి. వంతెనల నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించాం. మళ్లీ నిధులు మంజూరైతేనే పనులు ప్రారంభమవుతాయి.

– వరప్రసాద్, డీఈ, రోడ్లు భవనాల శాఖ



కేసీఆర్ కిట్లు అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

సిరిసిల్లటౌన్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కె.తారకరామారావు పుట్టినరోజు వేడుకలు పట్టణంలో గురువారం పండుగలా జరిగాయి. గాంధీచౌక్, ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్, తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కేక్‌లు కోసి స్వీట్లు పంచారు. స్థానిక జిల్లా ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. 'గిఫ్ట్ ఏ స్మైల్'లో భాగంగా బాలింతలకు కేసీఆర్ కిట్లను అందించారు. అనంతరం తెలంగాణ భవన్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించి, మెగా ప్లాంటేషన్ చేపట్టారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, చీటి నర్సింగరావు, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జిందం కళ, మాజీ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, అర్బన్ బ్యాంకు చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, బొల్లి రామ్మోహన్, కుంభాల మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలు వ్యాపారంలో రాణించాలి

- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- ఎరువులు, విత్తనాల దుకాణాలు ప్రారంభం



బోయినపల్లిలో ఎరువుల దుకాణం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యం, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

బోయినపల్లి(చొప్పదండి): ఇందిరా మహిళాశక్తి కింద ఎరువులు, ఫర్టిలైజర్ దుకాణాలు ఏర్పాటు చేసిన మహిళలు వ్యాపారంలో రాణించాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పేర్కొన్నారు. మండల కేంద్రంలో ధరిత్రి మహిళా సమాఖ్య, విలాసాగర్ గ్రామైఖ్య సంఘాల ద్వారా ఏర్పాటు చేసిన ఎరువులు–విత్తనాల దుకాణాలను గురువారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యం మేరకు ఇందిరా మహిళాశక్తి కింద మహిళా సంఘాలకు క్యాంటీన్లు, డెయిరీ యూనిట్, కోడిపిల్లల పెంపకం, ఆర్టీసీ బస్సుల యూనిట్లు అందజేస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మాట్లాడుతూ త్వరలో జిల్లాలో 23 దుకాణాలు మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. డీఆర్డీవో శేషాద్రి, డీఏవో అఫ్జల్ బేగం, తహసీల్దార్ నారాయణరెడ్డి, ఎంపీడీవో జయశీల, ఎంఏవో ప్రణీత, ఏపీఎం జయసుధ, సెస్ డైరెక్టర్ సుధాకర్, ఏఎంసీ చైర్మన్ ఎల్లేశ్‌యాదవ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, మాజీ ఎంపీపీ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గుడ్ల సరఫరా పర్యవేక్షణకు ప్రత్యేక కమిటీ

సిరిసిల్లకల్చరల్: వసతిగృహాల్లో కోడిగుడ్ల టెండర్ల పర్యవేక్షణకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ప్రకటించారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో గురువారం సమీక్షించారు. కలెక్టర్ చైర్మన్‌గా, జిల్లా విద్యాధికారి, ఆయా రెసిడెన్షియల్ విద్యాలయాల బాధ్యులు, పశుసంవర్ధకశాఖ అధికారులు సభ్యులుగా కమిటీని రూపొందిస్తామని తెలిపారు. గతేడాది అడ్మిషన్లకు అదనంగా మరో 10 శాతం విద్యార్థుల సంఖ్యను పెంచి ఇండెంట్ తయారు చేయాలని ఆదేశించారు. కోడిగుడ్డు బరువు 45 నుంచి 52 గ్రాములు ఉండాలని, నెలలో రెండుసార్లు సరఫరా చేయాలని పేర్కొన్నారు. డీఈవో వినోద్‌కుమార్, సంక్షేమాధికారి లక్ష్మీరాజం, పశుసంవర్ధకశాఖ అధికారి రవీందర్‌రెడ్డి, బీసీడీవో రాజమనోహర్‌రావు పాల్గొన్నారు.

తుప్పు పడుతున్నాయ్..



ముస్తాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఉన్న ఐకేపీ అద్దె ట్రాక్టర్

- అక్కరకు ఉపయోగపడని అద్దె యంత్రాలు
- అన్నదాతలకు అవగాహన కరువు
- వినియోగించుకోని రైతులు

ముస్తాబాద్(సిరిసిల్ల): సాగులో యాంత్రీకరణ ప్రవేశంతో పనులు సులభమయ్యాయి. ట్రాక్టర్లు, కల్టీవేటర్లతో పొలం పనులు వేగంగా పూర్తవుతున్నాయి. వీటిని కొనుగోలు చేసేంత ఆర్థిక స్థోమత లేని సన్న, చిన్నకారు రైతుల కోసం అద్దె ప్రాతిపదికన యంత్రాలను ఇచ్చేందుకు నాలుగేళ్ల క్రితం జిల్లాలోని ఏడు మండలాల్లో అందుబాటులోకి తెచ్చారు. మండల కేంద్రాల్లోని ఐకేపీ కార్యాలయాల్లో ఉంచారు. వీటిపై అవగాహన లేని రైతులు వినియోగించుకోవడం లేదు. ఫలితంగా ఆ యంత్రాలు తుప్పు పట్టిపోతున్నాయి.

అద్దెకు మిషిన్లు

మండల సమాఖ్యల ద్వారా కొనుగోలు చేసిన ట్రాక్టర్లు, కేజీవీల్స్, కల్టీవేటర్లు, నాగళ్లను రైతులకు అద్దెకు ఇచ్చేందుకు మండల కేంద్రాల్లోని ఐకేపీ కార్యాలయాల్లో ఉంచారు. ట్రాక్టర్‌కు రైతు నుంచి గంటకు రూ.వెయ్యి నుంచి రూ.1200 తీసుకోవాలి. కల్టీవేటర్‌కు రూ.200 నుంచి రూ.500 తీసుకుంటున్నారు. ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, బోయినపల్లి, ఇల్లంతకుంట, చందుర్తి, కోనరావుపేట మండల సమాఖ్యల్లో అద్దె వ్యవసాయ పనిముట్లను ఏర్పాటు చేశారు. అధికారులు రైతులకు అవగాహన కల్పించలేదనే విమర్శలు ఉన్నాయి. గడ్డి యంత్రాన్ని మాత్రం చాలా మంది రైతులు అద్దెకు తీసుకెళ్తున్నారు.

చోరీకి గురవుతున్న యంత్రాలు

మండల సమాఖ్య కేంద్రాల్లోని షెడ్లు, చెట్ల కింద ఉన్న ట్రాక్టర్లు, కల్టీవేటర్లు తుప్పుపడుతున్నాయి. గంభీరావుపేటలో చెట్టు కింద ఉన్న ట్రాక్టర్‌కు నిర్వహణ లేకుండా పోయింది. ముస్తాబాద్‌లో షెడ్డులో ఉన్న యంత్రాలు నాలుగు నెలల క్రితం చోరీకి గురయ్యాయి. ట్రాక్టర్‌ను ఎత్తుకెళ్లిన నెల రోజుల వరకు అధికారులకు తెలియలేదంటే అద్దె యంత్రాల నిర్వహణపై ఎంత శ్రద్ధ ఉందో తెలిసిపోతుంది. తర్వాత పోలీసులు కేసును ఛేదించినప్పటికీ ట్రాక్టర్ ఠాణాలోనే తుప్పు పడుతుంది. చాలా మండలాల్లో ఇదే పరిస్థితి ఉందని రైతులు పేర్కొంటున్నారు. తుప్పు పట్టి పనికిరాకుండా పోకముందే యంత్రాలను ఇతరులకు విక్రయిస్తేనైనా ఐకేపీకి నష్టాలు రావని పలువురు పేర్కొంటున్నారు.

కౌలురైతులకు ఉచితంగా ఇవ్వాలి



అద్దెకు యంత్రాలు ఇస్తారనే విషయమే తెలియదు. రైతులకు అవగాహన కల్పిస్తే వినియోగించుకుంటారు. కౌలురైతులకు ఉచితంగా ఇస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అధికారులు ఆలోచించాలి.

– మెరుగు అంజాగౌడ్, నామాపూర్

అవగాహన కల్పించాలి



ఐకేపీకి ప్రతీ గ్రామంలో నెట్‌వర్క్ ఉంది. ప్రతీ ఇంటి నుంచి మహిళలు ఐకేపీలో సభ్యులే. వారి ద్వారా రైతులకు అద్దె యంత్రాలపై అవగాహన కల్పిస్తే బాగుంటుంది. వృథాగా ఉండి, యంత్రాలు తుప్పు పడితే మండల సమాఖ్యలకే నష్టం.

– శాద శ్రీనివాస్, గూడెం

రైతులకు సమాచారం ఇస్తున్నాం



మండల సమాఖ్యలో ఉన్న అద్దె పనిముట్లపై రైతులకు గతంలోనే అవగాహన కల్పించాం. కొంతమంది ఉపయోగించుకున్నారు. ఎస్‌హెచ్‌జీలతో సమన్వయం చేసుకుని ట్రాక్టర్లకు అద్దెకు ఇస్తాం. రైతులు సద్వినియోగం చేసుకోవాలి. ముస్తాబాద్ ట్రాక్టర్ ప్రస్తుతం ఠాణాలో ఉంది. త్వరలో దానిని విడిపించి రైతులకు ఇస్తాం.

– దేవరాజు, ఏపీఎం, ముస్తాబాద్

క్లుప్తంగా

స్వగ్రామం చేరిన సాగర్ మృతదేహం


సాగర్ శవపేటిక వద్ద రోధిస్తున్న కుటుంబసభ్యులు


సాగర్(ఫైల్)

గన్నేరువరం(మానకొండూర్): మండలంలోని ఖాసీంపేట గ్రామానికి చెందిన బత్తుల సాగర్(42) ఈ నెల 22న కువైట్‌లో గుండె పోటుతో మృతి చెందాడు. గురువారం మృతదేహం స్వగ్రామం చేరింది. ఉపాధి కోసం సాగర్ మూడేళ్ల క్రితం గల్ఫ్ వెళ్లాడు. కుటుంబ సభ్యుల రోధనల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య


రమేశ్ మృతదేహం

గొల్లపల్లి: అప్పుల బాధ భరించలేక ఓ వ్యక్తి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని తిర్మాలాపూర్‌లో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు, ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గండికోట రమేశ్ (37) వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. వచ్చిన సంపాదనతో భార్య మంజుల, ముగ్గురు పిల్లలను పోషించుకుంటున్నాడు. ఉండడానికి ఇల్లు కూడా లేకపోవడంతో రెండేళ్ల క్రితం ఇంటి నిర్మాణానికి పూనుకున్నాడు. ఈ క్రమంలో అప్పు చేశాడు. పిల్లల్లో ఒకరు అనారోగ్యం బారిన పడ్డారు. వైద్య ఖర్చులకు మరింత అప్పు చేశాడు. వాటిని తీర్చేదారి లేక జీవితంపై విరక్తి చెంది సాయంత్రం ఇంట్లోనే ఉరేసుకున్నాడు. కుటుంబసభ్యులు వచ్చేసరికే చనిపోయాడు. ఇంటి పెద్ద మృతిచెందడంతో ఆ కుటుంబం శోక సంద్రంలో మునిగింది. రమేశ్ భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణసాగర్ రెడ్డి తెలిపారు.

వస్తువుల బహిరంగ వేలం

కరీంనగర్: నగరంలోని కార్ఖానగడ్డ ప్రభుత్వ దివ్యాంగుల, వయో వృద్ధుల వసతి గృహంలో నిరుపయోగంగా ఉన్న ఫర్నీచర్, బీరువాలు, చెక్క కప్‌బోర్డ్స్, ఫిజియోథెరపి చైర్ తదితర వస్తువులను బహిరంగ వేలం ద్వారా విక్రయిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు వస్తువులను ప్రభుత్వ దివ్యాంగుల, వయో వృద్ధుల వసతి గృహంలో ఈనెల 28వ తేదీ వరకు పరిశీలించుకుని వేలంలో పాల్గొనవచ్చునని అన్నారు. మరిన్ని వివరాలకు కార్యాలయ పని దినములలో 8096338488, 9492930728 నంబర్లను సంప్రదించవచ్చునని పేర్కొన్నారు.

సాఫల్యం.. వైఫల్యం!

- జిల్లాలో 20 శాతం మంది బాధితులు
- జీవనశైలి మార్పులే కారణం
- పెరిగిన సంతాన సాఫల్య కేంద్రాలు
- నేడు వరల్డ్ ఐవీఎఫ్ డే



కరీంనగర్‌టౌన్: వివాహమైన ప్రతీ స్త్రీ తల్లి కావాలని కోరుకుంటుంది. అయితే ఆ యోగ్యత కొందరికి మాత్రం లభించడం లేదు. ఇందుకు ఆమెలో కొన్ని అనారోగ్య కారణాలు, లేదా భర్తలో ఏదైనా లోపమైనా ఉండొచ్చు. వైద్యులను సంప్రదించి వారి సూచనలు పాటిస్తూ మహిళలు గర్భం దాలుస్తున్నారు. అమ్మ కల నెరవేర్చుకుంటున్నారు. ఐవీఎఫ్ విధానం ద్వారా చికిత్స తీసుకుంటున్నారు. నేడు వరల్డ్ ఐవీఎఫ్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.

పెరుగుతున్న సంతానలేమి సమస్య

ఇటీవల ఉమ్మడి జిల్లాలో సంతానలేమి సమస్యతో బాధపడేవారి సంఖ్య పెరుగుతోంది. ఒకప్పుడు వందలో ఒకరిద్దరు మాత్రమే సంతానలేమితో బాధపడేవారు. ఇప్పుడు ఆసంఖ్య 20శాతం వరకు ఉంటోంది. ఇలాంటి వారు వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకుని గర్భం దాలుస్తున్నారు. కొందరు మాత్రం మూఢ నమ్మకాలతో కాలం వెళ్లదీస్తున్నారు. కాలానుగుణంగా ఇప్పుడు వైద్యంపై అవగాహన పెరిగింది. గతంలో హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి నగరాలకు వెళ్లి సంతాన సాఫల్య కేంద్రాల్లో వైద్యులను సంప్రదించేవారు. ఇప్పుడు కరీంనగర్‌లో కూడా అలాంటి కేంద్రాలు ఏర్పాటయ్యాయి. అత్యాధునిక వసతులు, సౌకర్యాలతో మహానగరాల్లో అందించే వైద్యసేవలు ఇక్కడ అందిస్తున్నారు. కరీంనగర్‌లో పదికి పైగా ఫెర్టిలిటీ కేంద్రాలు (సంతాన సాఫల్య కేంద్రాలు) ఉన్నాయి. ఆయా కేంద్రాలకు ప్రస్తుతం రోజూ 30 నుంచి 40 మందిదాకా చికిత్స కోసం వస్తుంటారు.

సంతానలేమికి కారణాలివే..

ఇటీవల యువతీ యువకులు జీవితంలో స్థిరపడ్డాక వివాహం చేసుకుంటున్నారు. అమ్మాయిల సంఖ్య తగ్గిపోవడం వంటి కారణాలతో ఆలస్యంగా వివాహం చేసుకుంటున్నారు. దీంతో సంతానలేమి సమస్యలు పెరుగుతున్నాయి. మారిన జీవనశైలి, వ్యాయామం లేకపోవడం, స్థూలకాయం, మహిళల్లో పీసీఓడీ (అండాశయంలో తిత్తులు), రాత్రివేళల్లో ఆలస్యంగా నిద్రపోవడం, జంక్‌ఫుడ్ ఎక్కువగా తీసుకోవడం తదితర కారణాలతో సంతానలేమి సమస్య కలుగుతుంది.

ఐవీఎఫ్ అంటే..

చాలామంది సంతానం లేనివారు సంతాన సాఫల్య కేంద్రాలకు వెళ్తున్నారు. కానీ అక్కడ ఐవీఎఫ్ పద్ధతి గురించి వారికి అవగాహన ఉండదు. ఈ పద్ధతిలో బిడ్డను జన్మనివ్వాలి అనుకునే దంపతులు ముందుగా దాని గురించి అవగాహన ఉండాలి. అప్పుడే భవిష్యత్‌లో వారి మధ్య అపోహలు తలెత్తకుండా ఉంటాయి. సాధారణంగా స్త్రీ గర్భధారణ కలగాలంటే మగవారి వీర్యకణాలు ఆడవారి అండంతో కలవాలి. అది పిండంగా రూపాంతరం చెందుతుంది. ఈ విషయంలో ఇబ్బంది ఉన్నప్పుడు ఐవీఎఫ్ విధానంలో ల్యాబ్‌లో అండకణాలను సంగ్రహించడం చేసి స్పెర్మ్ నమూనాను మెరుగుపరుస్తారు.

ఐవీఎఫ్ ఎప్పుడు అవసరమంటే..

సాధారణంగా సంతానం లేనివారికి ఐవీఎఫ్ అవసరం లేదు. ముందుగా వైద్యులను సంప్రదించి సమస్యను వివరించాలి. దీన్ని బట్టి ముందుగా సహజసిద్ధంగా గర్భం దాల్చేలా తగిన చికిత్స, ఔషధాలు అందిస్తారు. సహజ సిద్ధంగా గర్భధారణ కలిగేందుకు అవకాశం లేకుండా ఉన్నవారికి మాత్రమే ఐవీఎఫ్ చికిత్స ప్రారంభిస్తారు. ముఖ్యంగా ఆడవారిలో ఫెలోపియన్ నాళాలు మూసుకుపోయినప్పుడు, అండకణాలు తక్కువగా ఉన్నప్పుడు, అండాశయ ట్యూబ్స్ బ్లాక్ అయినప్పుడు, ఎక్కువసార్లు అబార్షన్లు అయినవారికి, క్యాన్సర్ రోగులు, మగవారిలో స్పెర్మ్ నాణ్యత తక్కువగా, పూర్తిగా లేనప్పుడు ఐవీఎఫ్ చికిత్స అవసరం ఉంటుంది.

అపోహలు వద్దు



1978 జులై 25న ఇంగ్లండ్‌లో ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్ (ఐవీఎఫ్) అనే కృత్రిమ గర్భధారణ పద్ధతిలో జన్మించిన మొదటి బిడ్డ లూయిస్ బ్రౌన్ అయ్యారు. ఈ విజయానికి గుర్తుగా ఏటా జులై 25న ప్రపంచ ఎంబ్రియాలజిస్ట్ డేగా జరుపుతారు. ఇప్పటికీ చాలామందికి ఐవీఎఫ్ అంటే తెలియని భయం . సంతానం కలిగేందుకు అన్ని ప్రయత్నాలు చేసి విఫలమైనప్పుడు మాత్రమే ఐవీఎఫ్ మార్గాన్ని సూచిస్తాం.

– డాక్టర్ రేఖారాణి, రేఖాసాగర్ ఐవీఎఫ్ సెంటర్

సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు



30 ఏళ్లు దాటిన మహిళలకు సంతానోత్పత్తి సామర్థ్యం తగ్గుతుంది. ప్రపంచవ్యాప్తంగా ఈ విధానం ద్వారా ఇప్పటివరకు 8 మిలియన్ల మందికి పైగా జన్మించారు. అయితే ఐవీఎఫ్‌పై చాలామందికి అపోహలున్నాయి. ఐవీఎఫ్‌లోనూ ఐసీఎస్‌ఐ, ఐవీఎం, ఎగ్‌ఫ్రీజింగ్, స్పెర్మ్ ఫ్రీజింగ్, ఫెర్టిలిటీ ప్రిజర్వేషన్, ప్రీ ఇంప్లాంటేషన్, జనటిక్ టెస్ట్ అనే అడ్వాన్స్ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చాయి. ఐవీఎఫ్‌లో ఇచ్చే మందులతోనూ ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు.

– డాక్టర్ రజని ప్రియదర్శిని, రజని ఫెర్టిలిటీ సెంటర్

ప్రభుత్వ ఆస్పత్రిలో కత్తిపోట్ల కలకలం


పాలకుర్తి మహేశ్(ఫైల్)

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ ప్రభుత్వ మాతాశిశు ఆస్పత్రిలో గురువారం కత్తిపోట్ల కలకలం రేపింది. స్థానికులు కథనం.. చొప్పదండి మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన శ్రావణిని పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం దొంగతుర్తి గ్రామానికి చెందిన పాలకుర్తి మహేశ్‌కు ఇచ్చి వివాహం చేశారు.కాగా... శ్రావణి ఇటీవలే గర్భం దాల్చగా చికిత్స నిమిత్తం భర్త పాలకుర్తి మహేశ్ కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చాడు. ఆమెకు రక్తస్రావం కావడం.. కడుపులో పిండం సరిగా లేకపోవడంతో వైద్యులు అబార్షన్ చేశారు. విషయం తెలుసుకున్న శ్రావణి అన్న అదే ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న మహేశ్ బావ పాలకుర్తి మహేశ్‌పై కత్తితో దాడిచేశాడు. దీంతో ఆయనకు పలుచోట్ల గాయాలయ్యాయి. హాస్పిటల్ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వడంతో టూటౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. గాయపడ్డ పాలకుర్తి మహేశ్ నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిసింది.

వార్డెన్‌పై చర్య తీసుకోవాలి


రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు, సంఘాల నాయకులు

మంథని: మంథనిలో ఎస్సీ బాలుర కళాశాల వసతిగృహ విద్యార్థులు గురువారం రోడ్డెక్కారు. స్థానిక ప్రధాన చౌరస్తాలో రాస్తారోకో చేశారు. మెనూ ప్రకారం వార్డెన్ సరుకులు ఇవ్వడం లేదని, సక్రమంగా విధులకు హాజరుకావడం లేదని వాపోయా రు. వారానికి ఒకసారి మాత్రమే వసతి గృహానికి వచ్చి సరుకులు ఇచ్చి వెళ్తున్నారని, అవి సరిపోవడం లేదని పేర్కొన్నారు. టిఫిన్ ఆలస్యమవుతుందని, తమ ఆలస్యంపై ప్రిన్సిపాల్ పలుమా ర్లు హెచ్చరించారని ఆవేదన వెలిబుచ్చా రు. విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు మద్దతుగా రాస్తారోకోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెండు సంఘాల జిల్లా అధ్యక్షులు ఆర్ల సందీప్, గొర్రంకల సురేశ్ మాట్లాడుతూ, విద్యార్థులకు సమయానికి సరుకులు ఇవ్వకుండా, రోజువారీ మెనూ పెట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వార్డెన్ రమేశ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డివిజన్, జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో వసతి గృహాల సంరక్షకులు ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. విద్యార్థులు, నాయకులకు పోలీసులు సర్దిచెప్పి ఆందోళన విరమింపజేశారు.

రామానుజమ్మకు జాతీయ పురస్కారం


నటుడు భానుచందర్ నుంచి జాతీయ ప్రతిభ పురస్కారం అందుకుంటున్న రామానుజమ్మ

సిరిసిల్లకల్చరల్: జిల్లా కేంద్రానికి చెందిన వెటరన్ అథ్లెట్ టమటం రామానుజమ్మకు మరో ప్రతిభ పురస్కారం వరించింది. పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ వైఎంకే అకాడమీ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో నేషనల్ ఎక్సలెంట్ అవార్డులను ప్రదానం చేశారు. సిరిసిల్లకు చెందిన వెటరన్ అథ్లెట్, మార్షల్ ఆర్ట్స్ చాంపియన్ టమటం రామానుజమ్మను ఎంపిక చేశారు. వైఎంకే అధ్యక్షుడు, సినీ నటుడు భానుచందర్ అవార్డును అందజేశారు. ఏడుపదుల వయసులో జాతీయ స్థాయి పురస్కారం అందుకున్న రామానుజమ్మను పలువురు అభినందించారు.

మారుతి రైస్‌మిల్ అనుమతులు రద్దు

- కమర్షియల్ నుంచి అగ్రికల్చర్‌కు మార్పు
- ఆదేశాలు జారీ చేసిన అధికారులు


రైస్‌మిల్‌పై విచారణ చేపడుతున్న అధికారులు (ఫైల్)

వేములవాడరూరల్: ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి మిల్లు నిర్మించిన వ్యవహారంపై పలువురి ఫిర్యాదుతో విచారణ చేపట్టిన అధికారులు సదరు మిల్లు అనుమతులు రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వేములవాడరూరల్ మండలం మర్రిపల్లి శివారులో సర్వేనంబర్ 750లోని మల్లయ్యకుంటలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి రైస్‌మిల్లును కొందరు వ్యాపారులు నిర్మించిన విషయంపై గతంలో మల్లారం మాజీ ఎంపీటీసీ సంగెం వీరారెడ్డితోపాటు పలువురు రైతులు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన అధికారులు ఎట్టకేలకు ఆ మిల్లును కమర్షియల్ నుంచి అగ్రికల్చర్‌కు మార్పు చేసినట్లు వెల్లడించారు. సర్వేనంబర్ 750లో 18 ఎకరాల 18 గుంటల స్థలంలో దాదాపు 5 ఎకరాలకు మాత్రమే మిల్ యజమానులు నాలా కన్వర్షన్ తీసుకున్నట్లు అధికారులు గుర్తించారు. మిల్లు అనుమతులను, నాలా కన్వర్షన్‌ను రద్దు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వరుస కథనాలతో కదలిన యంత్రాంగం

మర్రిపల్లి శివారులో నిర్మించిన మారుతి రైస్‌మిల్లు నుంచి వస్తున్న వ్యర్థాలు, కలుషితంతో ఆ ప్రాంత రైతులకు, పాఠశాల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయంపై ‘సాక్షి’లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ కథనాలపై స్పందించిన అధికారులు గతంలో పలుమార్లు విచారణ చేపట్టారు. ప్రభుత్వ స్థలంలో మిల్లు నిర్మించినట్లు గుర్తించారు. ఎట్టకేలకు ఆ మిల్లు అనుమతులను రద్దు చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు.

కలెక్టర్‌కు కృతజ్ఞతలు



మర్రిపల్లి శివారులో మారుతి రైస్‌మిల్లును నిబంధనలకు వ్యతిరేకంగా నిర్మించారు. ప్రభుత్వ స్థలాన్ని సైతం ఆక్రమించారు. దీనిపై ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ స్పందించి అనుమతులు రద్దు చేయించారు. రైతులు, గ్రామస్తుల తరఫున కలెక్టర్‌కు కృతజ్ఞతలు.

– సంగెం వీరారెడ్డి, మాజీ ఎంపీటీసీ, మల్లారం

ఉత్తర్వులు వచ్చాయి



మర్రిపల్లి శివారులో నిర్మించిన మారుతి రైస్‌మిల్లు అనుమతులు రద్దు చేసినట్లు ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మించినట్లు ఫిర్యాదులు రావడంతో ఉత్తర్వులు వచ్చాయి.

– అబుబాకర్, తహసీల్దార్, వేములవాడరూరల్

వేధిస్తున్నాడని భార్యనే హతమార్చింది !

- గంజాయి కేసు విచారణతో హత్య కేసు వెలుగులోకి..
- మద్యానికి బానిసై వేధిస్తున్నాడని ఐదుగురితో కలిసి అఘాయిత్యం
- రెండేళ్ల క్రితం కొండగట్టులో దారుణం
- హత్యోదంతం అంతా సెల్‌ఫోన్‌లో చిత్రీకరణ
- గుర్తు తెలియని వ్యక్తి మృతి కేసుగా నమోదు
- నిందితురాలిని అరెస్టు చేసిన పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రఘుచందర్, సీఐ నీలం రవి, ఎస్సై నరేశ్‌కుమార్

మల్యాల: రెండేళ్ల క్రితం.. మల్యాల మండలం ముత్యంపేటలోని కొండగట్టులో గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద మృతి కేసును పోలీసులు ఛేదించారు. గుర్తు తెలియని వ్యక్తిని మెట్‌పల్లికి చెందిన సింగం నడిపి గంగాధర్(40)గా గుర్తించారు. మద్యానికి బానిసై నిత్యం వేధిస్తున్నాడని ఆయన భార్యే మరో నలుగురితో కలిసి హత్య చేసినట్లు నిర్ధారించారు. హత్యోదంతాన్ని నిందితులు వీడియో చిత్రీకరించారు. గంజాయి కేసులో పట్టుబడిన నిందితులను విచారించగా ఈ విషయాలన్నీ వెలుగుచూశాయి. రెండేళ్ల క్రితం జరిగిన ఈ సంఘటన సంబంధించిన వివరాలను డీఎస్పీ రఘుచందర్ స్థానిక సీఐ కార్యాలయంలో గురువారం వెల్లడించారు.

ముత్యంపేట శివారులో 2023 మార్చి 14న గుర్తు తెలియని వ్యక్తి కాలిపోయి ఉన్నాడని అప్పటి వీఆర్‌ఏ అజీమొద్దీన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈనెల 17న మెట్‌పల్లికి చెందిన సింగం గ్రాహిత్, అబ్దుల్ అఫ్సర్, చెన్న నిఖిల్‌ను మెట్‌పల్లి పోలీసులు గంజాయి కేసులో అరెస్టు చేశారు. వారి వద్దనున్న సెల్‌ఫోన్‌లు పరిశీలించగా.. హత్యకు సంబంధించిన వీడియో కనిపించింది. దీనిపై వారిని విచారించారు. మెట్‌పల్లికి చెందిన సింగం నడిపి గంగాధర్ మద్యానికి బానిసై నిత్యం భార్య సంధ్య, కుటుంబసభ్యులను శారీరకంగా, మానసికంగా వేధించేవాడు. ఇంట్లో వస్తువులు అమ్ముకుని జూదం ఆడేవాడు. నిత్యం మద్యం సేవించి వచ్చి హింసించేవాడు. పెద్ద కూతురు వివాహం చేసేందుకూ అడ్డుపడడంతో రూ.10వేలు ఇచ్చి ఒప్పించి.. బిడ్డ వివాహం చేశారు. కూతురి అత్తవారింటికి వెళ్లి అల్లుడితోనూ గొడవ పడేవాడు. ఈ విషయాన్ని సంధ్య గంగాధర్ అన్న కొడుకు గ్రాహిత్, తోటికోడలు మమతకు చెప్పింది. వారు గొడవ చేయవద్దని చెప్పినా గంగాధర్ వినిపించుకోలేదు. అతడిని చంపితేనే తాము సంతోషంగా ఉంటామని నిర్ణయించుకున్న సంధ్య.. గ్రాహిత్‌కు విషయం చెప్పింది. రూ.40వేలు ఇస్తే మరో ముగ్గురిని తీసుకొస్తానని అతడు చెప్పగా ఆ మొత్తం అందించింది. గ్రాహిత్ తన స్నేహితులైన అబ్దుల్ అఫ్సర్, పవన్ కలిసి గంగాధర్‌ను చంపేందుకు ఒప్పుకున్నారు. 2023 మార్చి 12న కారును అద్దెకు తీసుకుని సంధ్య, గ్రాహిత్, అబ్దుల్ అఫ్సర్, చెన్న నిఖిల్, పవన్, సింగం మమత కొండగట్టుకు వెళ్దామని చెప్పి గంగాధర్‌ను ఎక్కించుకుని ముత్యంపేట శివారు డంపింగ్‌యార్డు సమీపంలోకి చేరుకున్నారు. అక్కడ గంగాధర్‌కు మద్యం తాగించారు. సంధ్య, మమత గంగాధర్ కాళ్లు పట్టుకోగా.. గ్రాహిత్, అఫ్సర్ వైర్‌ను మెడకు చుట్టి ఊపిరాడకుండా చేశారు. నిఖిల్ ఎవరైనా వస్తున్నారా అని గమనిస్తూ ఉన్నాడు. గంగాధర్ చనిపోయాడని నిర్ధారించుకుని శవాన్ని ఎవరూ గుర్తించకుండా చెత్తలో వేసి నిప్పంటించారు. ఈ హత్యోదంతాన్ని మొత్తం వీడియోతీశారు. అనంతరం మెట్‌పల్లి వెళ్లిపోయారు. మార్చి 14న గుర్తుపట్టలేని స్థితిలో ఉన్న మృతదేహాన్ని స్థానికులు గమనించి వీఆర్‌ఏ అజీమొద్దీన్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయగా.. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు. గంజాయి కేసు విచారణలో సెల్‌ఫోన్‌లో హత్యకు సంబంధించిన వీడియో ఉండడంతో ఘటనలో ఆరుగురు పాల్గొన్నారని పోలీసులు నిర్ధారించుకున్నారు. వీరిలో గ్రాహిత్, అబ్దుల్ అఫ్సర్, నిఖిల్ ఇప్పటికే గంజాయి కేసులో అరెస్టయి ఉన్నారు. పవన్ మరో కేసులో చంచల్‌గూడ జైలులో ఉన్నాడు. మమత మృతి చెందింది. ఏ–1 నిందితురాలైన సింగం సంధ్యను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని, మిగిలిన వారిని కోర్టు అనుమతితో విచారించి, అరెస్టు చేస్తామని డీఎస్పీ తెలిపారు. సమావేశంలో సీఐ నీలం, ఎస్సై నరేశ్‌కుమార్ ఉన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య

జూలపల్లి(పెద్దపల్లి): భార్య కాపురానికి రావడం లేదని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని వెంకట్రావుపల్లె గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. వెంకట్రావుపల్లెకు చెందిన జుట్టు అంజయ్య(35) వికలాంగుడు. పదేళ్ల క్రితం దూళికట్టకు చెందిన జ్యోతితో పెండ్లి కాగా ముగ్గురు సంతానం. మూడునెలలుగా భార్య కాపురానికి రావడం లేదు. ఎంతగా ప్రయత్నం చేసినా భార్య రాక పోవడంతో అంజయ్య మానసికంగా బాధపడుతున్నాడు. ఈక్రమంలో రెండురోజులుగా ఇంటికి రాకపోవడంతో బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకి దొరకలేదు. గురువారం ఉదయం గ్రామంలోని ప్రభుత్వ తాగునీటి బావిలో మృతదేహం లభ్యమైంది. మృతుడి తండ్రి జుట్టు చిన్నవెంకయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు.

డెయిరీల్లో యూరియా అక్రమ నిల్వలు

- ఫర్టిలైజర్ దుకాణాల ద్వారా సరఫరా
- తనిఖీలు నామమాత్రమే.?

కరీంనగర్ అర్బన్: సాగుకు చేరాల్సిన రాయితీ యూరియా పక్కదారి పడుతోంది. అక్రమార్కుల వికృత చేష్టలతో సాగు రంగానికి సవాల్‌గా మారగా నియంత్రించాల్సిన యంత్రాంగం మొద్దునిద్రలో జోగుతోంది. అన్నదాత సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం రూ.వేలల్లో భరిస్తూ రైతులకు తక్కువ ధరకు యూరియా సరఫరా చేస్తుండగా క్షేత్రస్థాయిలో మాత్రం కేంద్ర లక్ష్యం నీరుగారిపోతోంది. ఓ అధికారి, ఓ హోల్‌సేల్ డీలర్, పలువురు ఫర్టిలైజర్ దుకాణదారుల తీరుతో అభాసుపాలవుతోంది. బహిరంగంగా యూరియా నిల్వలు కనబడుతున్నా అధికారుల కళ్లకు కనిపించకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఎక్కడి నుంచి కొనుగోలు చేశారు, ఎపుడు కొనుగోలు చేశారు, అసలు సదరు యూరియా ఉత్పత్తి అయి ఎన్ని రోజులవుతోంది, తాజాగా వచ్చిందా.. గతంలోదా..అన్నది తేల్చేందుకు అన్ని అవకాశాలున్నా తదనుగుణ చర్యలు లేవన్న ఆరోపణలున్నాయి.

డెయిరీలు, దాణా తయారీ కేంద్రాల్లో భారీ నిల్వలు

పాల డెయిరీలు, పశువుల దాణా, కోళ్ల దాణా తయారీ చేసే కేంద్రాల్లో పెద్దమొత్తంలో యూరియా నిలవ్వలున్నట్లు విశ్వసనీయ సమాచారం. చోట డెయిరీల నుంచి బడా డెయిరీల వరకు అక్రమమార్గంలో యూరియాను కొనుగోలు చేసి నిల్వ చేస్తున్నారు. పాల ఉత్పత్తిలో ఇది కీలకం కాగా నేరుగా కంపనీల నుంచి కొనాల్సిందిపోయి రైతుల పేరిట భారీ మొత్తంలో నిల్వ చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో పలు పాల డెయిరీలుండగా పశువుల దాణా, కోళ్ల దాణా తయారు చేసే కుటీర నుంచి భారీ పరిశ్రమలున్నాయి. ఈ నేపథ్యంలో వీటిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసే యంత్రాంగం కరవవడంతో వీరి దందా నిరాటంకంగా సాగుతోంది. సీజన్ వచ్చిందంటే చాలు ముందస్తు ప్రణాళికలతో సఫలీకృతులవుతున్నారు. ఏళ్లుగా ఈ దందా సాగుతుండగా పలువురు అధికారులకు ముడుపులు ముడుతున్నాయన్నది ఇంట, బయట వినిపిస్తున్న మాట.